05-10-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - బాబా పిల్లలైన మీ చేత దుఃఖధామము యొక్క సన్యాసము చేయించడానికి వచ్చారు, ఇదే అనంతమైన సన్యాసము"

ప్రశ్న:- ఆ సన్యాసుల సన్యాసానికి మరియు మీ సన్యాసానికి మధ్యన ముఖ్యమైన తేడా ఏమిటి?

జవాబు:- ఆ సన్యాసులు ఇళ్ళు-వాకిళ్ళను వదిలి అడవులలోకి వెళ్తారు కానీ మీరు ఇళ్ళు-వాకిళ్ళను వదిలి అడవులలోకి వెళ్ళరు. ఇంట్లో ఉంటూ మొత్తం ప్రపంచమంతటినీ ముళ్ళ అడవిగా భావిస్తారు. మీరు బుద్ధి ద్వారా మొత్తం ప్రపంచమంతటినీ సన్యసిస్తారు.

ఓం శాంతి. ఆత్మిక తండ్రి కూర్చొని ఆత్మిక పిల్లలకు ప్రతి రోజూ అర్థం చేయిస్తారు ఎందుకంటే అర్ధకల్పం నుండి వివేకహీనులుగా ఉన్నారు కదా. కావున ప్రతి రోజూ అర్థం చేయించవలసి ఉంటుంది. మొట్టమొదటైతే మనుష్యులకు శాంతి కావాలి. ఆత్మలందరూ వాస్తవానికి శాంతిధామ నివాసులే. తండ్రి అయితే సదా శాంతిసాగరుడు. ఇప్పుడు మీరు శాంతి వారసత్వాన్ని ప్రాప్తి చేసుకుంటున్నారు. శాంతిదేవ... అని అంటారు కదా, అనగా మమ్మల్ని ఈ సృష్టి నుండి మన ఇల్లయిన శాంతిధామములోకి తీసుకువెళ్ళండి మరియు శాంతి వారసత్వాన్ని ఇవ్వండి అని అర్థము. దేవతల ముందుకు లేక శివబాబా ముందుకు వెళ్ళి శాంతిని ఇవ్వండి అని అంటారు, ఎందుకంటే శివబాబా శాంతిసాగరుడు. ఇప్పుడు మీరు శివబాబా నుండి శాంతి వారసత్వాన్ని తీసుకుంటున్నారు. తండ్రిని స్మృతి చేస్తూ-చేస్తూ మీరు శాంతిధామములోకి తప్పకుండా వెళ్ళాలి. స్మృతి చేయకపోయినా కూడా తప్పకుండా వెళ్తారు. కానీ ఎందుకు స్మృతి చేస్తారంటే, పాపాల భారము ఏదైతే శిరస్సుపై ఉందో అది అంతమవ్వాలి అని. శాంతి మరియు సుఖము ఒక్క తండ్రి నుండే లభిస్తాయి ఎందుకంటే వారు సుఖ-శాంతుల సాగరుడు. ఇదే ముఖ్యము. శాంతిని ముక్తి అని కూడా అంటారు, ఆ తర్వాత జీవన్ముక్తి మరియు జీవన బంధనము కూడా ఉన్నాయి. ఇప్పుడు మీరు జీవన బంధనము నుండి జీవన్ముక్తులుగా అవుతున్నారు. సత్యయుగములో ఎటువంటి బంధనము ఉండదు. సహజ జీవన్ముక్తి లేక సహజ గతి, సద్గతి అని అంటూ ఉంటారు కూడా. ఇప్పుడు ఈ రెండింటి అర్థాన్ని పిల్లలైన మీరు అర్థం చేసుకున్నారు. గతి అని శాంతిధామాన్ని అంటారు, సద్గతి అని సుఖధామాన్ని అంటారు. సుఖధామము, శాంతిధామము, ఆ తర్వాత ఇది దుఃఖధామము. మీరు ఇక్కడ కూర్చున్నారు. తండ్రి అంటారు - పిల్లలూ, శాంతిధామమైన ఇంటిని స్మృతి చేయండి. ఆత్మలు తమ ఇంటిని మర్చిపోయారు. తండ్రి వచ్చి స్మృతిని కలిగిస్తారు. వారు అర్థం చేయిస్తారు - ఓ ఆత్మిక పిల్లలూ, ఎప్పటివరకైతే మీరు నన్ను స్మృతి చేయరో అప్పటివరకూ మీరు ఇంటికి వెళ్ళలేరు. స్మృతి ద్వారా మీ పాపాలు భస్మమైపోతాయి. ఆత్మ పవిత్రముగా అయి తిరిగి తన ఇంటికి వెళ్తుంది. పిల్లలైన మీకు తెలుసు - ఇది అపవిత్ర ప్రపంచము. ఇక్కడ పవిత్రమైన మనుష్యులు ఒక్కరు కూడా లేరు. పవిత్ర ప్రపంచాన్ని సత్యయుగమని, అపవిత్ర ప్రపంచాన్ని కలియుగమని అంటారు. రామ రాజ్యము మరియు రావణ రాజ్యము. రావణ రాజ్యము వలన అపవిత్ర ప్రపంచము స్థాపన అవుతుంది. ఇది తయారై-తయారుచేయబడిన ఆట కదా. దీనిని అనంతమైన తండ్రి అర్థం చేయిస్తారు. వారినే సత్యము అని అంటారు. సత్యమైన విషయాలను మీరు సంగమములోనే వింటారు, తర్వాత మీరు సత్యయుగములోకి వెళ్తారు. ద్వాపరము నుండి మళ్ళీ రావణ రాజ్యము ప్రారంభమవుతుంది. రావణుడు అనగా అసురుడు, అసురులు ఎప్పుడూ సత్యాన్ని చెప్పలేరు, అందుకే దీనిని అసత్యమైన మాయ, అసత్యమైన శరీరము అని అంటారు. ఆత్మ కూడా అసత్యముగా ఉన్నది, శరీరము కూడా అసత్యముగా ఉన్నది. ఆత్మలో సంస్కారాలు నిండుతాయి కదా. నాలుగు ధాతువులు ఉన్నాయి కదా - బంగారము, వెండి, రాగి, లోహము... మొత్తం మాలిన్యము అంతా తొలగిపోతుంది. ఇక మీరు ఈ యోగబలముతో సత్యమైన బంగారముగా అవుతారు. మీరు సత్యయుగములో ఉన్నప్పుడు సత్యమైన బంగారముగానే ఉంటారు. తర్వాత వెండి కలవడంతో చంద్రవంశీయులు అని అంటారు. ఆ తర్వాత రాగి, లోహముల మాలిన్యము ద్వాపర, కలియుగాలలో కలుస్తుంది. ఆ తర్వాత మీలో ఏదైతే వెండి, రాగి, లోహము యొక్క మాలిన్యము కలిసిందో అది యోగబలముతో తొలగిపోతుంది. మొదటైతే ఆత్మలైన మీరందరూ శాంతిధామములో ఉన్నారు, ఆ తర్వాత మొట్టమొదట సత్యయుగములోకి వస్తారు, అప్పుడు బంగారు యుగానికి చెందినవారు అని అంటారు. మీరు స్వచ్ఛమైన బంగారము. యోగబలముతో మొత్తం మాలిన్యము అంతా తొలగిపోయి స్వచ్ఛమైన బంగారము మిగులుతుంది. శాంతిధామాన్ని బంగారు యుగము అని అనరు. బంగారు యుగము, వెండి యుగము, రాగి యుగము అని ఇక్కడే అంటారు. శాంతిధామములో అయితే శాంతి ఉంటుంది. ఆత్మ ఎప్పుడైతే శరీరము తీసుకుంటుందో, అప్పుడు బంగారు యుగానికి చెందినవారిగా పిలవబడుతుంది, అప్పుడిక సృష్టియే బంగారు

యుగముగా అయిపోతుంది. సతోప్రధానమైన పంచ తత్వాలతో శరీరము తయారవుతుంది. ఆత్మ సతోప్రధానముగా ఉంటే శరీరము కూడా సతోప్రధానముగా ఉంటుంది. ఆ తర్వాత చివరిలో ఇక ఇనుప యుగ శరీరము లభిస్తుంది ఎందుకంటే ఆత్మలో మాలిన్యము కలుస్తుంది. కావున బంగారు యుగము, వెండి యుగము అని ఈ సృష్టినే అంటారు.

మరి ఇప్పుడు పిల్లలు ఏమి చేయాలి? మొట్టమొదట శాంతిధామములోకి వెళ్ళాలి, అందుకే తండ్రిని స్మృతి చేయాలి, అప్పుడే తమోప్రధానము నుండి సతోప్రధానముగా అవుతారు. అందుకు తండ్రి ఇక్కడ ఎంత సమయమైతే ఉంటారో అంత సమయమే పడుతుంది. వారు అసలు బంగారు యుగములో పాత్రనే తీసుకోరు. ఆత్మకు ఎప్పుడైతే శరీరము లభిస్తుందో అప్పుడు ఇది బంగారు యుగ జీవాత్మ అని అనడం జరుగుతుంది. బంగారు యుగ ఆత్మ అని అనరు. అలా అనరు. బంగారు యుగ జీవాత్మ, ఆ తర్వాత వెండి యుగ జీవాత్మగా అవుతుంది. ఇక్కడ మీరు కూర్చున్నారు, మీకు శాంతి కూడా ఉంది, అలాగే సుఖము కూడా ప్రాప్తిస్తుంది. కావున ఏమి చేయాలి? దుఃఖధామాన్ని సన్యసించాలి. దీనిని అనంతమైన సన్యాసము అని అంటారు. ఆ సన్యాసులది హద్దు సన్యాసము, వారు ఇళ్ళు-వాకిళ్ళను వదిలి అడవుల్లోకి వెళ్ళిపోతారు. వారికి అసలు ఈ సృష్టి అంతా అడవేనన్నది తెలియదు. ఇది ముళ్ళ అడవి. ఇది ముళ్ళ ప్రపంచము, అది పుష్పాల ప్రపంచము. ఆ సన్యాసులు సన్యసిస్తారు కానీ ఎంతైనా ఈ ముళ్ళ ప్రపంచములోనే, అడవుల్లోకి, నగరానికి దూరంగా వెళ్ళి ఉంటారు. వారిది నివృత్తి మార్గము, మీది ప్రవృత్తి మార్గము. మీరు పవిత్రమైన జంటగా ఉండేవారు, ఇప్పుడు అపవిత్రముగా అయ్యారు. పవిత్రముగా ఉన్నప్పుడు దానిని గృహస్థ ఆశ్రమము అని కూడా అంటారు. సన్యాసులు అయితే తర్వాత వస్తారు. ఇస్లాములు, బౌద్ధులు కూడా తర్వాత వస్తారు. వారు క్రిస్టియన్ల కన్నా కాస్త ముందు వస్తారు. కావున ఈ వృక్షాన్ని కూడా స్మృతి చేయాలి, చక్రాన్ని కూడా స్మృతి చేయాలి. తండ్రి కల్ప-కల్పమూ వచ్చి కల్పవృక్షము యొక్క జ్ఞానాన్ని ఇస్తారు ఎందుకంటే వారు స్వయం బీజరూపుడు, సత్యమైనవారు, చైతన్యమైనవారు, అందుకే కల్ప-కల్పమూ వచ్చి కల్పవృక్షము యొక్క రహస్యమంతటినీ అర్థం చేయిస్తారు. మీరు ఆత్మ కానీ మిమ్మల్ని జ్ఞానసాగరుడు, సుఖసాగరుడు, శాంతిసాగరుడు అని అనరు. ఈ మహిమ అంతా మిమ్మల్ని ఇలా తయారుచేసే తండ్రిదే. తండ్రి యొక్క ఈ మహిమ సదాకాలికముగా ఉంటుంది. సదా వారు పవిత్రముగా ఉంటారు మరియు నిరాకారునిగా ఉంటారు. పావనంగా తయారుచేయడానికి కేవలం కొద్ది సమయం కోసమే వస్తారు. సర్వవ్యాపి విషయమే లేదు. తండ్రి సదా అక్కడే ఉంటారని మీకు తెలుసు. భక్తి మార్గములో సదా వారిని తలచుకుంటూ ఉంటారు. సత్యయుగములోనైతే తలచుకునే అవసరమే ఉండదు. రావణ రాజ్యములో మీరు ఆర్తనాదాలు చేయడం ప్రారంభమవుతుంది, వారే వచ్చి సుఖ-శాంతులను ఇస్తారు. కావున తప్పకుండా మళ్ళీ అశాంతిలో వారి స్మృతి కలుగుతుంది. తండ్రి అర్థం చేయిస్తారు, ప్రతి 5000 సంవత్సరాల తర్వాత నేను వస్తాను. అర్ధకల్పం సుఖము, అర్ధకల్పం దుఃఖము. అర్ధకల్పం తర్వాతనే రావణ రాజ్యము ప్రారంభమవుతుంది. ఇందులో మొట్టమొదట ముఖ్యమైనది దేహాభిమానము. దాని తర్వాతే ఇతర వికారాలు వస్తాయి. ఇప్పుడు తండ్రి అర్థం చేయిస్తున్నారు - స్వయాన్ని ఆత్మగా భావించండి, దేహీ-అభిమానులుగా అవ్వండి. ఆత్మ పరిచయం కూడా కావాలి. మనుష్యులైతే ఆత్మ భృకుటి మధ్యలో మెరుస్తూ ఉంటుంది అని కేవలం అంటారు అంతే. ఇప్పుడు మీరు అర్థం చేసుకున్నారు - ఆత్మ అకాలమూర్తి, ఆ అకాలమూర్తి ఆత్మకు సింహాసనము ఈ శరీరము. ఆత్మ కూర్చోవడం కూడా భృకుటిలో కూర్చుంటుంది. అకాలమూర్తికి ఇది సింహాసనము, అన్నీ చైతన్యమైన అకాల సింహాసనాలే. అమృతసర్ లో చెక్కతో తయారుచేయబడిన ఆ సింహాసనము అకాల సింహాసనము కాదు. తండ్రి అర్థం చేయించారు - మనుష్యమాత్రులు ఎవరైతే ఉన్నారో, వారందరికీ తమ-తమ అకాల సింహాసనాలు ఉన్నాయి. ఆత్మ వచ్చి ఇక్కడ విరాజమానమవుతుంది. సత్యయుగమైనా లేక కలియుగమైనా ఆత్మ సింహాసనము ఈ మనుష్య శరీరమే. కావున ఎన్ని అకాల సింహాసనాలు ఉన్నాయి. మనుష్యమాత్రులు ఎవరైతే ఉన్నారో, వారంతా అకాల ఆత్మల సింహాసనాలే. ఆత్మ ఒక సింహాసనాన్ని వదిలి వెంటనే ఇంకొకటి తీసుకుంటుంది. మొదట చిన్న సింహాసనము ఉంటుంది, ఆ తర్వాత అది పెద్దది అవుతుంది. ఈ శరీరము రూపీ సింహాసనము చిన్నగా, పెద్దగా అవుతుంది. సిక్కులు అకాల సింహాసనము అని పిలిచే ఆ చెక్క సింహాసనము చిన్నగా, పెద్దగా అవ్వదు. మనుష్యమాత్రులందరి అకాల సింహాసనము ఈ భృకుటియే అన్నది ఎవ్వరికీ తెలియదు. ఆత్మ అకాలమూర్తి, అది ఎప్పుడూ వినాశనమవ్వదు. ఆత్మకు భిన్న-భిన్న సింహాసనాలు (శరీరాలు) లభిస్తాయి. సత్యయుగములో మీకు చాలా ఫస్ట్ క్లాస్ సింహాసనము లభిస్తుంది, దానిని బంగారు యుగ సింహాసనము అని అంటారు. ఆ తర్వాత ఆ ఆత్మకు వెండి, రాగి, ఇనుప యుగ సింహాసనాలు లభిస్తాయి. మరి బంగారు యుగ సింహాసనము కావాలంటే తప్పకుండా పవిత్రముగా అవ్వవలసి ఉంటుంది, అందుకే తండ్రి అంటారు, నన్నొక్కరినే స్మృతి చేసినట్లయితే మీ మాలిన్యము తొలగిపోతుంది, అప్పుడు మీకు ఇటువంటి దైవీ సింహాసనము లభిస్తుంది. ఇప్పుడు బ్రాహ్మణ కులము యొక్క సింహాసనము ఉంది. ఇప్పుడు పురుషోత్తమ సంగమయుగము యొక్క సింహాసనము

ఉంది, ఆ తర్వాత ఆత్మనైన నాకు ఈ దేవతా సింహాసనము లభిస్తుంది. ఈ విషయాలు ప్రపంచములోని మనుష్యులకు తెలియదు. దేహాభిమానములోకి వచ్చిన తర్వాత ఒకరికొకరు దుఃఖాన్ని ఇచ్చుకుంటూ ఉంటారు, అందుకే దీనిని దుఃఖధామము అని అంటారు. ఇప్పుడు తండ్రి పిల్లలకు అర్థం చేయిస్తున్నారు, శాంతిధామాన్ని స్మృతి చేయండి, అది మీ అసలైన నివాస స్థానము. సుఖధామాన్ని స్మృతి చేయండి, దీనిని మర్చిపోతూ వెళ్ళండి, దీనిపై వైరాగ్యము ఉండాలి. సన్యాసుల వలె ఇళ్ళు-వాకిళ్ళను వదిలేయాలి అని కూడా కాదు. తండ్రి అర్థం చేయిస్తారు, అది ఒక రకంగా మంచిది, ఇంకొక రకంగా చెడ్డది, కానీ మీదైతే అన్ని రకాలుగా మంచిదే. వారి హఠయోగము మంచిది కూడా, చెడ్డది కూడా, ఎందుకంటే దేవతలు వామ మార్గములోకి వెళ్ళినప్పుడు భారత్ ను నిలబెట్టేందుకు పవిత్రత తప్పకుండా కావాలి, కావున అందులో కూడా సహాయం చేస్తారు. భారత్ యే అవినాశీ ఖండము. తండ్రి రాక కూడా ఇక్కడే జరుగుతుంది. మరి ఎక్కడికైతే అనంతమైన తండ్రి వస్తారో, అది అన్నింటికన్నా పెద్ద తీర్థ స్థానమవుతుంది కదా. సర్వుల సద్గతిని తండ్రే వచ్చి చేస్తారు, అందుకే భారత్ యే ఉన్నతోన్నతమైన దేశము.

తండ్రి ముఖ్యమైన విషయాన్ని అర్థం చేయిస్తున్నారు - పిల్లలూ, స్మృతి యాత్రలో ఉండండి. గీతలో మన్మనాభవ అన్న పదము ఉంది కానీ తండ్రి ఏమీ సంస్కృతంలో చెప్పరు. తండ్రి మన్మనాభవ యొక్క అర్థాన్ని తెలియజేస్తారు. దేహపు సర్వ ధర్మాలనూ వదిలి స్వయాన్ని ఆత్మగా నిశ్చయం చేసుకోండి. ఆత్మ అవినాశీ, అది ఎప్పుడూ చిన్నగా, పెద్దగా అవ్వదు. ఆత్మలో అనాది, అవినాశీ పాత్ర నిండి ఉంది. డ్రామా తయారుచేయబడి ఉంది. చివరిలో ఏ ఆత్మలైతే వస్తారో వారికి చాలా తక్కువ పాత్ర ఉంటుంది, మిగిలిన సమయము శాంతిధామములో ఉంటారు. స్వర్గములోకి అయితే రాలేరు. చివరిలో వచ్చేవారు అక్కడే కాస్త సుఖాన్ని, మళ్ళీ అక్కడే కాస్త దుఃఖాన్ని పొందుతారు. దీపావళి నాడు ఎన్ని దోమలు వస్తాయి, మళ్ళీ ఉదయం లేచి చూస్తే అన్ని దోమలు చనిపోయి ఉంటాయి, అలాగే మనుష్యుల విషయములో కూడా ఇలాగే ఉంటుంది. చివరిలో వచ్చేవారికి ఏం విలువ ఉంటుంది. జంతువుల్లా ఉన్నట్లే. ఈ సృష్టి చక్రము ఎలా తిరుగుతుందో, మనుష్య సృష్టి రూపీ వృక్షము చిన్నది నుండి పెద్దగా, మళ్ళీ పెద్దది నుండి చిన్నగా ఎలా అవుతుందో తండ్రి అర్థం చేయిస్తారు. సత్యయుగములో ఎంత కొద్దిమంది మనుష్యులు ఉంటారు, కలియుగములో ఎంతగా వృద్ధి చెంది వృక్షము పెద్దగా అవుతుంది. తండ్రి ఇచ్చిన ముఖ్యమైన సూచన ఏమిటంటే - గృహస్థ వ్యవహారములో ఉంటూ నన్నొక్కరినే స్మృతి చేయండి. 8 గంటలు స్మృతిలో ఉండేందుకు అభ్యాసము చేయండి. స్మృతి చేస్తూ-చేస్తూ చివరికి పవిత్రముగా అయి తండ్రి వద్దకు వెళ్ళిపోతారు, అప్పుడు స్కాలర్షిప్ కూడా లభిస్తుంది. ఒకవేళ పాపాలు మిగిలి ఉన్నట్లయితే మళ్ళీ జన్మ తీసుకోవలసి ఉంటుంది. శిక్షలు అనుభవిస్తారు, మళ్ళీ పదవి కూడా తక్కువైపోతుంది. లెక్కాచారాలనైతే అందరూ తీర్చుకోవలసిందే. మనుష్యమాత్రులు ఎవరైతే ఉన్నారో, వారందరూ ఇప్పటివరకూ కూడా జన్మలు తీసుకుంటూ ఉంటారు. ఈ సమయములో భారతవాసుల కన్నా క్రిస్టియన్ల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తుంది. వాళ్ళు తెలివైనవారు కూడా. భారతవాసులు 100 శాతం వివేకవంతులుగా ఉండేవారు, ఇప్పుడు మళ్ళీ వివేకహీనులుగా అయిపోయారు ఎందుకంటే వీరే 100 శాతం సుఖాన్ని పొందుతారు, మళ్ళీ 100 శాతం దుఃఖాన్ని కూడా వీరే పొందుతారు. వాళ్ళు అయితే రావడమే తర్వాత వస్తారు.

తండ్రి అర్థం చేయించారు, క్రిస్టియన్ వంశావళికి మరియు శ్రీకృష్ణుని వంశావళికి సంబంధం ఉంది. క్రిస్టియన్లు రాజ్యాన్ని లాక్కున్నారు, మళ్ళీ క్రిస్టియన్ వంశము నుండే రాజ్యము లభించనున్నది. ఈ సమయములో క్రిస్టియన్ల తీవ్రత ఎక్కువ ఉంది. వారికి భారత్ నుండే సహాయము లభిస్తుంది. ఇప్పుడు భారత్ ఆకలితో అలమటిస్తోంది కావున రిటర్న్ సర్వీస్ జరుగుతోంది. ఇక్కడి నుండి చాలా ధనాన్ని, చాలా వజ్ర-వైఢూర్యాలు మొదలైనవాటిని అక్కడకు తీసుకువెళ్ళారు, ఎంతో ధనవంతులుగా అయ్యారు, అందుకే ఇప్పుడు మళ్ళీ ధనాన్ని చేరుస్తూ ఉంటారు. వారికి ఇదేమీ తిరిగి లభించేది ఉండదు. ఇప్పుడు పిల్లలైన మిమ్మల్ని అయితే ఎవరూ గుర్తించరు. ఒకవేళ గుర్తించినట్లయితే వారు వచ్చి సలహాను తీసుకుంటారు. మీరు ఈశ్వరీయ సాంప్రదాయులు, మీరు ఈశ్వరుని సలహాపై నడుస్తారు. మీరే మళ్ళీ ఈశ్వరీయ సాంప్రదాయుల నుండి దైవీ సాంప్రదాయులుగా అవుతారు. ఆ తర్వాత క్షత్రియ, వైశ్య, శూద్ర సాంప్రదాయులుగా అవుతారు. ఇప్పుడు మనం బ్రాహ్మణులుగా ఉన్నాము, మళ్ళీ మనమే దేవతలుగా, క్షత్రియులుగా... అవుతాము. హంసో యొక్క అర్థము ఎంత బాగుందో చూడండి. ఇది పిల్లిమొగ్గల ఆట, దీనిని అర్థం చేసుకోవడం చాలా సహజము. కానీ మాయ మరపింపజేస్తుంది, అప్పుడు దైవీ గుణాల నుండి ఆసురీ గుణాలలోకి తీసుకువస్తుంది. అపవిత్రులుగా అవ్వడం ఆసురీ గుణమే కదా. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక

పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. స్కాలర్షిప్పు తీసుకునేందుకు గృహస్థ వ్యవహారములో ఉంటూ తక్కువలో తక్కువ 8 గంటలు తండ్రిని స్మృతి చేసే అభ్యాసము చేయాలి. స్మృతి యొక్క అభ్యాసముతోనే పాపాలు తొలగుతాయి మరియు బంగారు యుగ సింహాసనము లభిస్తుంది.

2. ఈ దుఃఖధామము పట్ల అనంతమైన వైరాగ్యమును ఉంచి తమ అసలైన నివాస స్థానమైన శాంతిధామాన్ని మరియు సుఖధామాన్ని స్మృతి చేయాలి. దేహాభిమానములోకి వచ్చి ఎవ్వరికీ దుఃఖాన్ని ఇవ్వకూడదు.

వరదానము:- కర్మల లెక్కాచారాన్ని అర్థం చేసుకుని తమ అచంచలమైన స్థితిని తయారుచేసుకునే సహజయోగీ భవ

నడుస్తూ-నడుస్తూ ఒకవేళ ఏదైనా కర్మల లెక్కాచారము ఎదురుగా వస్తే, దాని కారణంగా మనసును చలించనివ్వకండి, స్థితిని కిందా-మీదా చేసుకోకండి. సరే వచ్చింది, దానిని పరిశీలించి దూరం నుండే సమాప్తం చేయండి. ఇప్పుడు యోధులుగా అవ్వకండి. సర్వశక్తివంతుడైన తండ్రి తోడుగా ఉన్నట్లయితే మాయ కదిలించలేదు. కేవలం నిశ్చయం అనే పునాదిని ప్రాక్టికల్ లోకి తీసుకురండి మరియు సమయానికి ఉపయోగించండి, అప్పుడు సహజయోగులుగా అవుతారు. ఇప్పుడు నిరంతర యోగులుగా అవ్వండి, యుద్ధం చేసే యోధులుగా అవ్వకండి.

స్లోగన్:- డబల్ లైట్ గా ఉండాలంటే తమ సర్వ బాధ్యతల భారాన్ని తండ్రికి అర్పించండి.